సాక్షి అనంతపురం

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ. 22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.8

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.9°/ 22.7°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్


అనంతపురం రూరల్: బాలల హక్కులను పరిరక్షించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం దామోదరం సంజీవయ్య (పెన్నార్) భవనంలోని సమావేశ మందిరంలో సంక్షేమ వసతి గృహాల అధికారులు, రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు, బాల బాలికలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. అన్ని విద్యాలయాల విద్యార్థులకు బాలల హక్కులు, పరిరక్షణ కోసం పనిచేస్తున్న వ్యవస్థలు, చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి అవగాహన కల్పించాలన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు బాలికల వసతి గృహాల్లో వీలైనంతవరకు పురుష సిబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అన్నాదొరై తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడ్డ దేహదారుఢ్య పరీక్షలు నేటి నుంచి



కర్నూలు : రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీ ఎస్పీ రెండవ పటాలంలో ఆగస్టు 25 నుంచి దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. భారీ వర్షం కారణంగా సెప్టెంబర్ 4, 5 తేదీల్లో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలను ఈ నెల 21, 22 తేదీలకు వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే గురువారం నుంచి ఈ నెల 22 లోపు ఎప్పుడైనా ఆయా తేదీల్లో కేటాయించిన అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకావచ్చని కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

పారామెడికల్ పోస్టులకు 1,788 దరఖాస్తులు



అనంతపురం క్రైం: పారా మెడికల్ పోస్టులకు 1,788 దరఖాస్తులు వచ్చాయని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. ఈ నెల 6న జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న వివిధ ఆస్పత్రులలో 52 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. జనరల్ డ్యూటీ అటెండెంట్‌కు అత్యధికంగా 900కు పైగా దరఖాస్తులు వచ్చాయని డీసీహెచ్‌ఎస్ తెలిపారు. పరిశీలన అనంతరం ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామన్నారు.

వైభవంగా గంధం వేడుకలు



జైనబ్బీ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు

ఉరవకొండ: పట్టణంలోని బీబీ జైనబ్బీ ఉరుసు ఉత్సవాల్లో బుధవారం రాత్రి గంధం వేడుకలు వైభవంగా జరిగాయి. పుష్పాలతో అలంకరించిన ముత్యాల వాహనంలో అల్లప్పరెడ్డి ఇంటి నుంచి మెయిన్ బజార్ మీదుగా హుసేన్‌పీరా సాబ్ ఇంటి వద్ద చేపదేవుని గుడి వరకు మేళతాళాల నడుమ బాణసంచ కాల్చుతూ గంధం ఊరేగించారు. ప్రధాన కూడళ్ల నుంచి గంధంను దర్గాకు చేర్చారు. వేడుకల్లో దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, కార్యదర్శి జీఎంఎస్ షాకీర్, కోశాధికారి జెండా జిలాన్, గౌరవ సలహాదారు పామిడి జాకీర్, అయ్యర్‌దాదూ, వడ్లసలీం, తాషాఖాదర్‌బాషా, షర్మాస్, బేల్దార్ షర్మాస్, ప్రతాప్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీ ఏదీ?

నైరాశ్యంలో టీడీపీ శ్రేణులు

- చంద్రబాబు జైలుకు వెళ్లడంపై ఉలుకూ పలుకూ లేదు
- నిరసన దీక్షలకు కార్యకర్తలను బతిమలాడాల్సిన పరిస్థితి
- చంద్రబాబుకు ప్రజల్లో మచ్చుకైనా కానరాని సానుభూతి
- బంద్ విఫలంతోనే బట్టబయలైన పార్టీ దుస్థితి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. పార్టీ అధినేత 'స్కిల్ స్కాం'లో ఇరుక్కుని రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండు ఖైదీగా వెళ్లారు. దీనికి నిరసనగా టీడీపీ బంద్‌కు పిలుపునిస్తే రోడ్డుమీదకు వచ్చి ఆందోళన చేసే వారే కరువయ్యారు. నామమాత్రంగా కూడా బంద్ జరగకపోవడంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పార్టీ పూర్తిగా తేలిపోయింది. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయాల్లో ఉన్నా మంచి చేసిందేమీ లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉండటమే దీనికి కారణమని తెలుస్తోంది. డబ్బులిస్తామన్నా ఆందోళన చేసేందుకు జనం రాకపోవడంతో పార్టీ నాయకుల్లో నైరాశ్యం ఆవహించింది.

కరువైన ప్రజాదరణ

చంద్రబాబును జైలుకు పంపినందుకు నిరసనగా రెండు జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు చేసే అంశంపై చర్చించేందుకు ఈ నెల 12న టీడీపీ నాయకులు అనంతపురంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది కూడా కేడర్ హాజరు కాలేదు. దీంతో రిలే నిరాహార దీక్షలు, వినతిపత్రాలు అందించడం, చంద్రబాబు గురించి గ్రామాల్లో చెప్పడం వంటివి ప్రజాదరణ లేకుండా ఎలా సాధ్యమన్న ఆలోచనలో పడ్డారు. బంద్ పిలుపునకే రానప్పుడు మండలాల వారీగా జనాన్ని రిలే దీక్షలకు తెప్పించడం సాధ్యమా అన్నది నాయకులను కలవరపెడుతోంది. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలుంటే.. ఏ మండలంలోనూ పట్టుమని పదిమంది కార్యకర్తలు వచ్చే పరిస్థితి కనిపించలేదు. 41 లక్షల పైచిలుకు జనాభా ఉన్న ఉమ్మడి అనంత జిల్లాలో 4 వేల మంది కూడా బాబుకు మద్దతు ఇవ్వలేదే అని తెలుగుదేశం నాయకులు లోలోపల మదనపడుతున్నారు.

ఉచ్చు బిగుస్తుండటంతో...

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు రోజురోజుకూ ఉచ్చు బిగుసుకుంటోంది. బుధవారం హైకోర్టులో ఏసీబీ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఆర్డర్లను కొట్టి వేయాలని వేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. మరోవైపు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ... 2014–19 మధ్య జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ ఒప్పందంతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని తేల్చింది. కంపెనీ ప్రమేయం లేకుండానే దాన్ని చేర్చి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఇదొక్కటే కాదు మరిన్ని స్కాములు తెరమీదకు రావడంతో టీడీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముందుకొచ్చి మాట్లాడటానికి జంకుతున్నారు. కిందిస్థాయి కేడర్‌లోనూ, కార్యకర్తల్లోనూ చంద్రబాబు తప్పు చేశారన్న భావన ఉండటంతో ఏ ముఖం పెట్టుకుని రిలే దీక్షలు చేపడతామని లోలోపల మదనపడుతున్నారు.

పాపం వెంటాడుతోంది



టీడీపీ హయాంలో విచ్చలవిడిగా ప్రజాధనం దోపిడీ చేసిన పాపం చంద్రబాబును వెంటాడుతోంది. ఈయనకు ప్రజల నుంచి మద్దతు లభించే పరిస్థితి లేదు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుల్లో చంద్రబాబుకు ఉచ్చు బిగుసుకుంది. పక్కా ఆధారాలతోనే ఆయన్ను జైలుకు పంపించారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ను సమర్థిస్తూ ఆందోళన చేసే పరిస్థితి ఎందుకుంటుంది?

–కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

టీడీపీది ముగిసిన శకం



తెలుగుదేశం పార్టీ పని అయిపోయింది. చంద్రబాబును నమ్మి ఆయన వెంట నడిచేవారు లేరు. కేడర్‌లో ఆందోళన ఉంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే నాయకులెవరో ప్రజలకు తెలుసు. అందుకే కుంభకోణాల్లో ఇరుక్కుని చంద్రబాబు జైలుకెళ్లినా ఎవరూ రోడ్డెక్కి ఆందోళన చేసే పరిస్థితి లేదు. ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా బాబును కార్యకర్తలు నమ్మడం లేదు.

– డాక్టర్ తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

నీటి నిల్వతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో జాయింట్ కమిషనర్ శివప్రసాద్

అనంతపురం సిటీ: నీటి పొదుపుపై అవగాహన కల్పించడంతో పాటు ఎక్కడికక్కడ నీటిని భద్రంగా నిల్వ చేస్తే బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ శివప్రసాద్ అన్నారు. బుధవారం జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన 'గ్రామీణ ప్రాంతాల్లో నీటి భద్రత-వాతావరణ అనుకూలతలు' అనే అంశంపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. జాయింట్ కమిషనర్ శివప్రసాద్ సహా జాయింట్ కలెక్టర్/జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్, ఐజీజెడ్ డైరెక్టర్ డాక్టర్ రెంగా లక్ష్మీ, ఐజీజెడ్ టీమ్ డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ నాగరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాయింట్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ జీఐఎస్ ప్లానింగ్ ద్వారా సాంకేతిపరమైన పనులు చేపట్టవచ్చని తెలిపారు. వర్క్‌షాప్‌లో తెలియజేసిన అన్ని రకాల అంశాలను ఉపాధి సిబ్బంది అవగాహన చేసుకోవాలని సూచించారు. ఆత్మకూరు పరిధిలోని జీఐఎస్ ద్వారా పెద్ద ఎత్తున ఫారంపాండ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో వాటిని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. డ్వామా, రూరల్ డెవలప్‌మెంట్, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, అటవీ, మత్స్య శాఖల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నీటి భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీఐఎస్ ఉద్దేశం, వాటి ప్రయోజనాలను జాయింట్ కలెక్టర్ కేతన్ వివరించారు. సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌ఓ చంద్రశేఖర్, భూగర్భ జల శాఖ డీడీ తిప్పేస్వామి, డీపీఓ ప్రభాకర్‌రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

ఆరోగ్య సురక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

- సీఎంకు వివరించిన కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' అంశంపై ముఖ్యమంత్రి బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 30న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రారంభించామన్నారు. అదే విధంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, ఎన్‌సీసీ కేడెట్లను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. సురక్ష క్యాంపెయిన్‌లో భాగంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల గురించి, వైద్యసేవలు, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

ఇంటింటి క్యాంపెయిన్ చేపట్టండి

సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటి క్యాంపెయిన్ చేపట్టాలని సూచించారు. క్యాంపెయిన్‌లో ప్రతి ఒక్కరి ఆరోగ్య చరిత్రలు నమోదు చేయాలని చెప్పారు. వలంటీరు రెండుసార్లు క్యాంపెయిన్ చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. మండల, మునిసిపల్ స్థాయిలో ఏర్పాటు చేసే బృందాలు సమష్టిగా క్యాంపెయిన్‌కు వెళ్లాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు
- పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మంత్రి ఉషశ్రీచరణ్



పార్టీలోకి చేరిన వారితో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాలకు చెందిన టీడీపీ, కాంగ్రెస్, జనసేన కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. సచివాలయ – వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చామన్నారు. పారదర్శక పాలన నచ్చి టీడీపీ, జనసేన, కాంగ్రెస్ నుంచి ఎంతోమంది వైఎస్సార్‌సీపీలోకి క్యూ కడుతున్నారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఇరుక్కుని అరెస్టయ్యి.. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారన్నారు. తప్పు చేసిన వాళ్లు శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజాధనం దోపిడీ చేసి చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడన్నారు. సాక్ష్యాధారాలతో అరెస్టు చేసినా అక్రమమంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో అనేక కుంభకోణాలు జరిగినా.. కోర్టుల్లో స్టే తెచ్చుకుని విచారణ జరగకుండా తప్పించుకుంటూ వచ్చారన్నారు. వీటిపై కూడా లోతుగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో బ్రహ్మసముద్రం మండలం ఎస్.కోనాపురం, ఎరడికెర, బొమ్మగానిపల్లి తండా, బొమ్మగానిపల్లి, భైరసముద్రం, గుండిగానిపల్లి, పొబ్బర్లపల్లి, ఎరడికెర, పాల వెంకటాపురం, బ్రహ్మసముద్రం, నంజాపురం, ముప్పలకుంట, సూగేపల్లి, తీటకల్లు, ఎస్.కొండాపురం, శెట్టూరు మండలం చింతర్లపల్లి, కళ్యాణదుర్గం మండలం దొడగట్ట గ్రామాలకు చెందిన దాదాపు 250 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ బసవరాజు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డితో పాటు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు ఆదినారాయణరెడ్డి, తలారి గోవిందప్ప, ఎంపీటీసీ సభ్యులు నాగలక్ష్మి, సువర్ణమ్మ, తిప్పేస్వామి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి వద్దు.. ఆరుతడే ముద్దు

- తుంగభద్ర, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో వర్షాభావం
- హెచ్చెల్సీ, హంద్రీ-నీవాలకు తగ్గనున్న నీటి వాటా
- ఆరుతడి పంటలే శ్రేయస్కరమంటున్న అధికారులు
- నేడు సాగునీటి సలహామండలి సమావేశం



అనంతపురం సెంట్రల్: ఆశించిన స్థాయిలో వర్షాలు కురవనందున ఈసారి వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయడం శ్రేయస్కరమని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాతో పాటు ఎగువన కర్ణాటక ప్రాంతంలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలకు అనుకున్న స్థాయిలో నీరు చేరడం లేదు. దీంతో హెచ్చెల్సీ, హంద్రీ-నీవా ప్రాజెక్టులకు ఈ ఏడాది నీటి వాటా గణనీయంగా తగ్గే అవకాశముంది. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఎక్కువ నీటి తడులు అవసరమయ్యే వరి కాకుండా ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం శ్రేయస్కరమని సూచిస్తున్నారు. గురువారం జిల్లా పరిషత్‌లోని డీఆర్‌సీ భవనంలో సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో పంటల సాగుపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు.

10 టీఎంసీలు తాగునీటికే..

పెరుగుతున్న జనాభా దృష్ట్యా రోజురోజుకూ తాగునీటి అవసరాలు భారీగా పెరుగుతున్నాయి. తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే నీటిలో 10 టీఎంసీలు తాగునీటికే వెచ్చించాల్సి వస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో జరిగిన బోర్డు సమావేశంలో తుంగభద్ర జలాశయానికి 175 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని, దామాషా ప్రకారం 26.828 టీఎంసీలు హెచ్చెల్సీకి కేటాయింపులు చేశారు. ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా మారుతున్నాయి. ప్రస్తుతం జలాశయంలో 67.806 టీఎంసీల నీటి నిల్వ ఉండగా 2164 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. భారీ వర్షాలు రాకపోతే తొలుత కేటాయించిన 26.828 టీఎంసీల్లోనే కోత పడనుంది. తాగునీటి అవసరాలు పోనూ 10 నుంచి 12 టీఎంసీలు మాత్రమే సాగునీటికి రానున్నాయి.

- హంద్రీ-నీవా నీటి పరిస్థితి కూడా ఇబ్బందికరంగానే ఉంది. ఈ సమయానికి పూర్తిగా నిండి పరవళ్లు తొక్కే శ్రీశైలం జలాశయం ఈ ఏడాది ఒక్కసారి కూడా నిండలేదు. ప్రస్తుతం జలాశయంలో 92 టీఎంసీల నీటి నిల్వ ఉండగా.. 1,688 క్యూసెక్కుల నీటిని హంద్రీ-నీవా ద్వారా జిల్లాకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరి సాగు సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి తోడు జిల్లాలో కూడా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి అవసరాలు భారీగా పెరగనున్నాయి.

ఆరుతడి పంటలే మేలు

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం శ్రేయస్కరం. దీని వలన చివరి ఆయకట్టుకు కూడా నీటిని అందించవచ్చు. వర్షాభావ పరిస్థితుల వలన ఆన్‌అండ్ ఆఫ్ పద్ధతిలో నీళ్లు ఇవ్వాలని భావిస్తున్నాం. వరి సాగు చేస్తే రైతులు ఇబ్బందులు పడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని గుర్తించి పంటలు సాగుచేసుకోవాలని కోరుతున్నాం.

– ఎస్.రాజశేఖర్, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

హెచ్చెల్సీ నీటి కేటాయింపులు ఇలా..

సంవత్సరం	నీటి విడుదల	తాగునీటికి (టీఎంసీల్లో)	సాగునీటికి (టీఎంసీల్లో)	సాగైన ఆయకట్టు (ఎకరాల్లో)
2016-17	17.476	8.128	8.389	87,271
2017-18	23.149	6.172	8.710	1,05,493
2018-19	27.133	6.902	11.105	1,08,991
2019-20	26.164	7.330	6.120	98,527
2020-21	32.164	10.188	12.706	87,685
2021-22	23.000	9.203	13.957	85,398

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దే!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

శిబిరం చిరునామా:
విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, డో.నం: 6-2-39, కోవూరునగర్, అనంతపురం.
ఫోన్ నంబరు : 9912220717

క్లుప్తంగా

ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలి : డీఏఓ



ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

పెద్దపప్పూరు: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల నమోదు (ఈ-క్రాప్) పక్కాగా చేపట్టాలని వ్యవసాయాధికారులను ఆ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. పెద్దపప్పూరు మండలం షేక్‌పల్లి, గార్లదిన్నెలో బుధవారం చేపట్టిన ఈ-క్రాప్ బుకింగ్‌ను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, మాట్లాడారు. సాగు చేసిన పంట వివరాలనే నమోదు చేయాలని సూచించారు. కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇప్పటి వరకూ నిర్మాణాలు పూర్తయిన ఆర్‌బీకేలను ఆధీనంలోకి తీసుకుని రైతు సేవలు మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ చెంగల్‌రాయుడు, ఏఓలు ఆంజనేయులు, శంకర్‌లాల్‌నాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులంతా క్షేమం



తునాతునకలైన విద్యుత్ స్తంభం

రాయదుర్గం టౌన్: స్థానిక 20వ వార్డు పైతోటలోని మొలకాల్మూరు ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడుపుతూ వేగాన్ని నియంత్రించుకోలేక జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది కాస్త తునాతునకలై పోయింది. బస్సు ముందు భాగంగా దెబ్బ తినింది. డ్రైవర్‌తో పాటు ప్రయాణికులందరూ క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఆ వార్డు కౌన్సిలర్ పైతోట సంజీవప్ప వెంటనే విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేసి, కరెంట్ సరఫరా నిలిపివేయించారు. విద్యుత్ శాఖ ఏఈ బాలు అక్కడ చేరుకుని పరిశీలించి, దాదాపు రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

గణపయ్య పండుగ..వైవిధ్య వేడుక

- ఏటేటా రెట్టింపు అవుతున్న 'వినాయక' సందడి
- ఊరూరా కొలువుదీరుతున్న బొజ్జ గణపయ్యలు
- పట్టణాల్లో ఉత్సవ కమిటీల సాయం
- పల్లెల్లో యువత చొరవ
- ఐక్యతకు ప్రతీకగా వేడుకలు



వేడుకకు వేళాయె : గణనాథునికి తుది మెరుగులు దిద్దుతున్న మహిళ

సాక్షి, అనంతపురం డెస్క్: వినాయక చవితి పండుగ అంటే అందరిలోనూ ఉత్సాహం. వేడుకలను వైభవంగా, విభిన్నంగా, గత ఏడాదికి మించి చేయాలనే తపన. పండుగకు పది, పదిహేను రోజుల ముందు నుంచే ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. చందాల వసూలు, మంటపాల నిర్మాణం, డీజే, ఆర్కెస్ట్రా..ఇలా ప్రతి అంశంలోనూ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఒకప్పుడు వేడుకలు ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లోనే జరిగేవి. నేడు గ్రామీణ ప్రాంతాల్లోనూ పట్టణాలకు ఏమాత్రమూ తీసిపోకుండా నిర్వహిస్తున్నారు.

యువోత్సాహం..కమిటీల సాయం

గత కొన్నేళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అనంతపురం నగరంతో పాటు తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, హిందూపురం పట్టణాల్లో వేలాది విగ్రహాలు కొలువుదీరుతున్నాయి. వీటితో పాటు ద్వితీయశ్రేణి పట్టణాలు, మండల కేంద్రాలు, చివరకు మారుమూల పల్లెల్లో సైతం వీధివీధినా గణనాథులను కొలువుదీర్చి ఆరాధిస్తున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలు వేడుకల నిర్వహణలో తగిన సహాయ సహకారాలు అందిస్తున్నాయి. పల్లెల్లో పూర్తిగా యువత ముందుండి నడిపిస్తున్నారు. చిన్నా పెద్ద, పేద, ధనిక, కుల, మతాలకు అతీతంగా అందరినీ వేడుకల్లో భాగస్వాములు చేస్తున్నారు.

సెలవు పెట్టి.. సందడి చేసి

బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్, ఇతరత్రా రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువకులు వినాయక చవితి పండుగ సమయంలో కచ్చితంగా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఉద్యోగాలకు సెలవు పెట్టడమో, కుదరని పక్షంలో వర్క్ ఫ్రం హోం ఆప్షన్‌ను ఎంచుకుని పల్లెల్లో ప్రత్యక్షమవుతున్నారు. ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం ఇతరత్రా సందర్భాలను కాదనుకుని వినాయక చవితి సమయంలో మాత్రం సొంతూళ్లకు చేరుకుంటున్నారు. వీరంతా ముందుండి వేడుకలు నడిపిస్తున్నారు. వీరి ఉత్సాహాన్ని చూసి స్థానికులు కూడా ప్రోత్సహించడంతో పాటు వేడుకల్లో భాగస్వాములవుతున్నారు.

ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పల్లెల్లో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు వెలుస్తున్నాయి. వీటిలో పది, పదిహేను రోజుల ముందు నుంచే చర్చ మొదలవుతోంది. చందాల వివరాలు, వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లు, ఎవరెవరు ఏయే సహకారం అందిస్తున్నారన్న సమాచారాన్ని అందులో షేర్ చేస్తున్నారు. మంటపాల వద్ద సందడి, నిమజ్జనోత్సవ దృశ్యాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరించి వీడియోలు, ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో పెడుతున్నారు. తద్వారా ఇతర ప్రాంతాల్లో ఉంటూ అనివార్య కారణాల వల్ల ఊళ్లకు రాలేకపోతున్న వారికి కూడా ఆనందాన్ని పంచుతున్నారు.

సామాజిక బాధ్యత మరవొద్దు..

పట్టణాలతో పాటు పల్లెల్లోనూ గణేశ్ వేడుకలు వైభవంగా నిర్వహిస్తుండడం శుభ పరిణామం. ఇది ఐక్యతకు, సామరస్యానికి దోహదపడుతోంది. కానీ ఇందులో సామాజిక బాధ్యతనూ విస్మరించరాదు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన పెద్ద పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయి. జలచరాలకు ప్రమాదం ఏర్పడుతోంది. మనుషులకూ కాలుష్యపు పోటు తప్పడం లేదు. కావున ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఆలోచించి మట్టి గణపయ్యలను ఆరాధించాల్సిన అవసరముంది. అప్పుడు మాత్రమే ఈ వేడుకలకు అర్థం, పరమార్థం ఉంటుంది. గణనాథుని చల్లని దీవెనలూ దక్కుతాయి.

మట్టి గణపతే శ్రేష్ఠం



జడ పదార్థమైన భూమి.. చైతన్యం కలిగిన నీళ్లతో చేరినప్పుడు ప్రాణ శక్తి కలుగుతుంది. తద్వారా ఆహార పదార్థాలు, ఔషధులను మనకు అందిస్తుంది. ప్రాణధార, జడశక్తుల కలయికతో సృష్టి ముందుకు సాగుతున్నదన్న సంగతిని చెప్పడానికే గణపతి విగ్రహాన్ని మట్టి, నీరు కలిపి తయారు చేసి, పూజించే విధానం ఏర్పడింది. మట్టి విగ్రహాలనే పూజించమని శాస్త్రమే ఉద్బోధిస్తున్నది. వాతావరణ కాలుష్యం కాకుండా మట్టి విగ్రహాలు ఎంతో మేలు చేస్తాయి. కావున ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే ఆరాధించాలి.

– మహేశ్వర శర్మ, శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు

నా చిన్నప్పుడు ఇలా లేదు



నా చిన్నతనంలో ఇలా విగ్రహాలు పెట్టేవారు కాదు. పండుగ రోజు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించి.. బంధువులతో సంబరంగా గడిపేవాళ్లం. గౌరీ దేవిని ఏర్పాటు చేసి ఇంట్లో పూజలు చేసేవాళ్లం. పశువులను శుభ్రం చేసి పూజించేవాళ్లం. కానీ కాలం మారింది. యువకులు పెద్దఎత్తున సంబరాలు చేస్తుండడంతో మేము కూడా అందులో పాలు పంచుకుంటున్నాం.

– వెంకటేషు, పెడపల్లి, పుట్టపర్తి మండలం

ఉత్సవాలకు తప్పకుండా వస్తా



నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. చిన్నప్పటి నుంచి స్వగ్రామంలో జరిగే వినాయకచవితి ఉత్సవాల్లో తప్పకుండా పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో ఇంతకన్నా ఎక్కువగానే వేడుకలు జరుగుతాయి. కానీ స్వగ్రామంలో పొందే అనుభూతే వేరు. అందుకే వచ్చే వారంలో జరిగే వినాయక చవితి వేడుకలకు కుటుంబ సమేతంగా హాజరయ్యేందుకు ఇప్పట్నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నాం.

– శ్రీరామ్‌రెడ్డి, క్రిష్టాపురం, బొమ్మనహాళ్ మండలం

ఆ అనుభూతే వేరు




బెంగళూరులోని అకాడ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నా. వినాయక చవితి వచ్చిందంటే చాలు సొంతూరిలో జరిగే ఉత్సవాల్లో స్థానిక మిత్రులతో కలసి పాల్గొంటా. ఉద్యోగానికి సెలవు పెట్టి కొద్ది రోజులు ఇక్కడే ఉండి.. వేడుకల్లో పాల్గొని సరదాగా గడిపి వెళ్లడం ఆనవాయితీ. ఈసారి ఉత్సవాలకు వచ్చేందుకు వీలుగా సెలవు కూడా ముందే పెట్టేశా.

– రాఘవేంద్ర, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, రాయదుర్గం

చంద్రబాబు శిక్షార్హుడే

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం క్రైం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో పక్కా ఆధారాలతో పట్టుబడిన కుప్పం ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు న్యాయస్థానం విధించే శిక్షను అనుభవించక తప్పదని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం అనంతపురంలోని వేణుగోపాల్‌నగర్‌లో పర్యటించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అవినీతి కేసులో బయటపడేందుకు రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసుకున్నా లాయర్లు సైతం స్కిల్ స్కాంలో అవినీతి జరగలేదని వాదించడం లేదన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఇంత కాలం తన అక్రమాలు బయట పడకుండా చేస్తూ వచ్చారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన స్కిల్ స్కాంను జీఎస్టీ అధికారులు గుర్తిస్తే... సీఐడీ అధికారులు సుదీర్ఘ విచారణ చేపట్టి చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రేరిపితం లేదన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఎవరికైనా కఠిన శిక్ష పడాల్సిందేనన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, సీఆర్‌డీఏ, రాజధాని నిర్మాణం, ఏపీ సచివాలయ భవన నిర్మాణాల్లో చోటు చేసుకున్న అక్రమాలపై కూడా విచారణ చేపడితే చంద్రబాబు అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయన్నారు. సచివాలయ నిర్మాణం కోసం చదరపు అడుగుకు రూ.2వేలు చెల్లించాల్సిన చోట ఏకంగా రూ.9,500 చెల్లించారని, సకాలంలో పూర్తి చేసినందుకు మరో రూ.2వేలు అదనంగా ఇచ్చారన్నారు. వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆలోచన అని, అలాంటి గొప్ప వ్యక్తిపై ప్రతిపక్షాలు అనవసరంగా విమర్శలు చేయడం మంచిదికాదన్నారు. చట్టం తన పని తాను చేసుకెళ్తుందని, తప్పు చేస్తే శిక్ష తప్పదన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ మొదటి సంవత్సరం ఒకటవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు ఆ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ (అనంతపురం) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

యువకుడి బలవన్మరణం

గుత్తి: స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని తురకపల్లి సమీపంలో బుధవారం ఉదయం బేల్దారి శివలింగ (34) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గుత్తిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న శివలింగకు ఇద్దరు భార్యలు, ఓ కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న శివలింగ కొన్ని నెలలుగా వీపులో నొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో నొప్పి తీవ్రత భరించలేక జీవితంపై విరక్తి చెందిన ఆయన బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై గుత్తి రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- పాతిపెట్టిన మృతదేహం వెలికితీత.. పోస్టుమార్టం



మృతురాలు చిట్టెమ్మ

కణేకల్లు: మండలంలోని మండలం సొల్లాపురం గ్రామంలో రెండ్రోజుల క్రితం పాతిపెట్టిన వివాహిత చిట్టెమ్మ (40) మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికి తీయించి, పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తం కావడంతో శ్మశాన వాటికలోనే పోస్టుమార్టం చేయించారు. పోలీసులు తెలిపిన మేరకు... సొల్లాపురం నివాసి వన్నూరుస్వామికి 25 ఏళ్ల క్రితం బెళుగుప్ప మండలం శిర్పి గ్రామానికి చెందిన చిట్టెమ్మతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ వన్నూరుస్వామి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొన్ని రోజులుగా కుటుంబంలో కలహాలు చోటు చేసుకుని దంపతులు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం చిట్టెమ్మ ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందింది. ఆమె మృతిపై కుటుంబసభ్యులకు అనుమానాలు ఉన్నా.. గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే అంశాన్ని చిట్టెమ్మ తరఫు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఉదయం సొల్లాపురం గ్రామ శ్మశాన వాటికకు చేరుకుని పాతిపెట్టిన చిట్టెమ్మ మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, తహసీల్దార్ రజాక్‌వలీ, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

'అనంత'లో పనిచేయడం గొప్ప అనుభూతి


- వీడ్కోలు సభలో ఎస్పీ శ్రీనివాసరావు
- ఘనంగా వీడ్కోలు పలికిన ఏఆర్ విభాగం



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో తక్కువ కాలం పని చేసినా.. తనకు గొప్ప అనుభూతిని ఇచ్చిందని, ఇది మరువలేనిదని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. విశాఖ వెస్ట్ జోన్ డీసీపీగా బదిలీ అయిన ఆయనకు బుధవారం పోలీసు పరేడ్ మైదానంలో ఏఆర్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం పోలీసు క్వార్టర్సులో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలు, సిబ్బంది చూపించిన ప్రేమాభిమానాలను మరువలేనన్నారు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో తాను పని చేసినా ఎక్కడా ఇంతటి సంతృప్తికరమైన విధులను చూడలేదన్నారు. నేరాలను ఛేదించే క్రమంలో పనిని సవాళుగా తీసుకోవడం, టీమ్ వర్క్ చేయడం లాంటి అనేక అంశాల్లో సిబ్బంది చూపిన ఆత్మస్థైర్యం స్ఫూర్తిదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. అనంత వాసుల్లో మానవత్వం ఎక్కువగా ఉందన్నారు. ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ రోడ్డు ప్రమాద సమయంలో అనిత ఆరోగ్యంపై అనంత వాసులు స్పందించిన తీరును కొనియాడారు. కష్టం ఎవరికి వచ్చినా కరిగిపోయి ఆపన్నహస్తాలందించే వ్యక్తిత్వం అనంత వాసుల సొంతమన్నారు. మంచి వాతావరణంలో పని చేశానన్నా సంతృప్తితో వెళుతున్నానన్నారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఆయన కుటుంబసభ్యులు, సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, డీఎస్పీలు శ్రీనివాసులు, గంగయ్య, నర్సింగప్ప, శివారెడ్డి, మునిరాజ్, జి. ప్రసాద్‌రెడ్డి, సీఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర, విశ్వనాథచౌదరి, దేవానంద్, రెడ్డప్ప, శివరాముడు, ధరణీకిషోర్, ప్రతాప్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నాగార్జునరెడ్డి, ఆర్‌ఐలు హరికృష్ణ, రాముడు, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం నేతలు పాల్గొన్నారు.

వైద్య సేవలపై కేంద్ర బృందం పరిశీలన



కేంద్ర బృందంతో కొర్రపాడు పీహెచ్‌సీ సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై బుధవారం ఎన్‌క్యూఏఎస్ టీం (నేషనల్ క్వాలిటీ బృందం) సభ్యులు పరిశీలించారు. ముందుగా పీహెచ్‌సీ పరిధిలో ఎన్ని గ్రామాలున్నాయో అడిగి తెలుసుకున్నారు. రోజూ ఎంత మందికి వైద్య సేవలు అందుతున్నాయని ఆరా తీశారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. ఓపీ విభాగం, ఐపీ విభాగం, ప్రసూతి, ల్యాబొరేటరీ, హెల్త్ ప్రోగ్రాం, జనల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగాలను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న సేవలపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీలో న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన డాక్టర్ సుబ్రజ్యోతిరావు, ఆకాబక్షి ఉన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి, జిల్లా క్వాలిటీ టీం సభ్యులు స్టీఫెన్, కొర్రపాడు డాక్టర్లు శ్రీహర్ష, డాక్టర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

అనంతపురం: యూనివర్సిటీ క్యాంపస్, అనుబంధ కళాశాలల్లోని పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు పోస్టు గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ పీజీసెట్)-2023 కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 20 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 13 నుంచి 22వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 20 నుంచి 24 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 25వ తేదీ వెబ్‌ఆప్షన్ల మార్పు చేర్పులు, 27వ తేదీన సీట్ల కేటాయింపు, ఈ నెల 29న రిపోర్టింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

నేటి నుంచి ఇంజినీరింగ్ తుది దశ కౌన్సెలింగ్

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్-2023 ఇంజినీరింగ్ ప్రవేశాల్లో భాగంగా గురువారం నుంచి తుది దశ కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో ప్రాసెసింగ్ ఫీజు, 16వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, 17వ తేదీలోపు కళాశాల ఆప్షన్ల నమోదు, మార్పు చేర్పులు, 21వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. సీటు లభించిన కళాశాలలో ఈ నెల 25లోగా నేరుగా రిపోర్ట్ చేయాలని తెలిపారు.

గొర్రెల కాపర్ల సంక్షేమానికి ప్రాధాన్యత

- 'షీప్' యూనియన్ సమావేశంలో చైర్మన్ నరసింహగౌడ్



మాట్లాడుతున్న పసుపుల నరసింహగౌడ్

అనంతపురం అగ్రికల్చర్: జీవ సంపద పరిరక్షణ, గొర్రెల కాపర్ల సంక్షేమానికి జగన్ సర్కారు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల యూనియన్ జిల్లా స్థాయి త్రీమెన్ కమిటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్ అన్నారు. అనంతపురంలోని పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ప్రాంగణంలో ఆ యూనియన్ జిల్లా మహాజనసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహగౌడ్ మాట్లాడుతూ... గొర్రెలు, మేకల సంరక్షణకు ఏటా క్రమం తప్పకుండా వివిధ రకాల వ్యాక్సిన్లను ఉచితంగా ఇస్తున్నారని, వ్యాధులు ప్రబలిన సందర్భంలో సకాలంలో వైద్య చికిత్సలు, సలహాలు అందుతున్నాయని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన గొర్రెల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీడీసీ పథకం కింద గతంలో పెద్ద మొత్తంలో తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకున్న వారు కంతుల వారీగా బకాయిలు చెల్లించాలన్నారు. రికవరీలను బట్టి రెండో విడత కూడా ఎన్‌సీడీసీ నుంచి మరింత ఎక్కువ మొత్తంలో రుణాలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని తెలిపారు. గ్రామ స్థాయిలో సొసైటీల ఏర్పాటు, కొత్త సభ్యుల చేరిక, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆ శాఖ ఏడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి, సొసైటీల అధ్యక్షులు నల్లప్ప, సంగప్ప, రామాంజినేయులు, రమేష్, మాజీ అధ్యక్షుడు రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో 'జల్లెడ' పట్టండి

- ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్



జల్లెడ పురుగు ఆశించిన మామిడి చెట్టు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలో మామిడిని దెబ్బతీస్తున్న జల్లెడ పురుగు నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. జల్లెడ పురుగునే గూడు పురుగు, ఆకుతినే గొంగలి పురుగు అని కూడా అంటారన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జల్లెడ పురుగు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పురుగు ఆశిస్తే ఆకులు జల్లెడలా మారి గూడుకట్టుకుని పురుగు ఆకులోనే ఉంటుందన్నారు. కొత్తగా వచ్చే చిగుర్లను తినడం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయన్నారు. నివారణ చర్యల్లో భాగంగా పురుగు కట్టిన గూడును పొడవాటి కర్రతో చెదరగొట్టాలన్నారు. అలాగే ఎండిపోయిన ఆకుల గూడులను తొలగించాలన్నారు. అనంతరం లీటర్ నీటికి 2.5 మి.లీ క్లోరిపైరిపాస్ లేదా 2 మి.లీ నొవాల్యురాన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. 10 రోజుల తర్వాత లీటర్ నీటికి జీవశిలీంధ్రనాశిని బవేరియ బసియానా 5 మి.లీ + మెటార్హిజియం 5 మి.లీ కలిపి పిచికారీ చేసుకుంటే సమర్థవంతంగా పురుగు ఉధృతిని అరికట్టవచ్చునన్నారు.

నేటి నుంచి రైల్వే గేట్ మూసివేత

అనంతపురం సిటీ: పామిడి పంచాయతీ పరిధిలోని పి.కొండాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే గేట్‌ను గురువారం నుంచి మూడు రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ మేరకు గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవిబాబు బుధవారం తెలిపారు. లెవల్ క్రాసింగ్ పోర్షన్ ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ వరకూ గేట్ మూసి వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించాలని కోరారు.

కళ్లలో కారం చల్లి చైన్ స్నాచింగ్



ఆరా తీస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్

తాడిపత్రి: మహిళా రైతు కళ్లలో కారం చల్లి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం రావివెంకటాంపల్లికి చెందిన దంపతులు కొండేటి వెంకట్రాముడు, అనిత... తాడిపత్రి – అనంతపురం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ పొలాన్ని గుత్తకు తీసుకుని సాగు చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం పొలంలో పనులు చేసుకుంటున్న అనిత వద్దకు ఓ అగంతకుడు చేరుకుని కళ్లలో కారం చల్లి ఆమె మెడలోని రూ. 2 లక్షల విలువైన 4 తులాల బంగారు గొలుసు లాక్కొని ద్విచక్రవాహనంపై ఉడాయించాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. అక్కడికి సమీపంలో ఉన్న సీసీ కెమెరా పుటేజీని పరిశీలించి, ఆగంతకుడి ఆనవాళ్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది పని చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం సూచించారు. బుధవారం నగరంలోని పలు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కాపు నేస్తం, ఈ బీసీ నేస్తం, చేయూత పథకాలు అర్హులైన వారికి అందించాలన్నారు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాప్తాడు: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి బుధవారం తెలిపారు.

ఆత్మకూరులో రేపు..

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఈనెల 15వ తేదీన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సుబ్బర హేమలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలపోతన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. మధ్యాహ్నం నుంచి మండల కేంద్రంలో నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కనగానపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఎంఈఓ శ్రీదేవి ప్రారంభించారు. బాలబాలికలను రెండు విభాగాలు చేసి 9 రకాల పోటీలు నిర్వహించారు. కబడ్డీలో మోడల్ స్కూల్, ఖోఖోలో జెడ్పీ హెచ్ఎస్ కనగానపల్లి, త్రోబాల్‌లో కేజీబీవీ, వాలీబాల్‌లో మద్దెలచెరువు, అథ్లెటిక్స్‌లో మామిళ్లపల్లి, తగరకుంట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు గెలుపొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆత్మకూరులో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీదేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవికిరణ్, ఎస్‌సీ చైర్మన్ విశ్వనాథ్, పీఈటీలు మాధవరాజులు, శివారెడ్డి, జయసింహా, గురుప్రియ పాల్గొన్నారు.

కొత్తగా 35 పింఛన్ల మంజూరు



కక్కలపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నారని అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి సర్పంచ్ గార్లదిన్న కృష్ణయ్య తెలిపారు. పంచాయతీ వ్యాప్తంగా నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కొత్తగా 35 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అలాగే అనంతపురం మండలం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 16 మందికి సర్పంచ్ బి.సావిత్రి శ్రీనివాసులు చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండి రమేష్, ఎంపీటీసీ ఓబులేసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు లే అవుట్ పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ఆలమూరు లే అవుట్‌ను అదనపు కమిషనర్ రమణా రెడ్డి బుధవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వీడి పనులను వేగవంతం చేయాలన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త చంద్రమోహన్ రెడ్డి

ఆత్మకూరు: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఎస్ఆర్ఎస్ రేకులకుంట సైంటిస్ట్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరుధాన్యాల అవసరాన్ని ప్రపంచం గుర్తించిందని తెలిపారు. అందుకే ఈ యేడాదిని అంతర్జాతీయ చిరు ధాన్యాల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పంటలను ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. చిరుధాన్యాలకు ఇప్పుడు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఏఎఫ్ ఎకాలజీ కమ్యూనికేషన్ అధికారి రమేష్ మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు వేర్వేరు చోట్ల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- వేణుగోపాల్ నగర్‌లో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అధికారులు

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యంత ప్రాధన్యత కల్పించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను మరింత బలోపేతం చేసి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో కొత్తగా ఆరు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో కేంద్రానికి రూ.80 లక్షల నుంచి రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి అత్యాధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఇప్పటికే నాలుగు భవనాలను పూర్తి చేశామని, త్వరలో మరో రెండు భవనాలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. మిగతా నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రూ.40 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించామన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోనే 64 రకాల వైద్య పరీక్షలు (డెంగీ, మలేరియా, షుగర్, తదితర పరీక్షలు) నిర్వహించడానికి రూ.లక్షలు విలువ చేసే పరికరాలతో పాటు యాంటీ స్నేక్ వీనమ్, ఖరీదైన యాంటీబయాటిక్స్ ఇలా 172 రకాల మందులతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పది పథకల ఏర్పాటు..

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పది పథకలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 3,225 వైద్య చికిత్సలకు ఉచితంగా వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా కింది స్థాయి సిబ్బంది నుంచి డీఎంహెచ్ఓ వరకూ అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి, కమిషనర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు అంకె కుమారమ్మ, సుజాత, నాయకులు కృష్ణమూర్తి, యోగి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపాలి

గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతులకు పరిష్కారం చూపాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, కార్పొరేటర్లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. నగరంలోని 40వ డివిజన్‌లోని 58వ సచివాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు.

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు నాణ్యమైన వైద్యం అందించడానికి ఈనెల 15 నుంచి చేపట్టబోయే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. వలంటీర్లు, ఆశాలు ఇంటింటా సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. స్పెషలిస్టు, యూపీహెచ్‌సీ వైద్యులతో వైద్యసేవలు అందించేలా కార్యాచరణ రూపొందించారన్నారు.

ప్రజలను వంచిస్తే జైలు తప్పదు



మహిళలకు పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- చంద్రబాబు కోసం దీక్షలు చేయడానికి సిగ్గుండాలి
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో జైలు పాలైన చంద్రబాబు కోసం టీడీపీ నాయకులు దొంగ దీక్షలు చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం పాపంపేట, గణేష్‌నగర్, బసవతారకనగర్, పిల్లిగుండ్లకాలనీల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు కోసం దీక్షలు చేస్తున్న వారికి కాస్తయినా సిగ్గుండాలన్నారు. దొంగ, దోషి అయిన చంద్రబాబును వెనుకేసుకొస్తారా? అని మండిపడ్డారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును విస్మరించి జూనియర్ ఎన్టీఆర్‌ను తెచ్చుకుని పార్టీని నడిపించుకోవాలని హితవు పలికారు.

బాబుకు బుద్ధి పెరగలేదు

మాజీ సీఎం చంద్రబాబుపై పలు కేసుల్లో దర్యాప్తు జరుగుతోందన్నారు. మోసం చేయడానికే రాజకీయాలను ఉపయోగించుకున్నారన్నారు. ప్రజలను వంచించే ఏ రాజకీయ నాయకుడికైనా జైలు తప్పదనే మెసేజ్ వెళ్లాలంటే చంద్రబాబును శాశ్వతంగా జైలుకు పంపాలన్నారు. టీడీపీ ఏజెంట్లను పెట్టుకునే పరిస్థితి ఉండదన్నారు. చాలా నియోజకవర్గాల్లో వారికి అభ్యర్థులు కూడా ఉండరని తెలిపారు.

ప్రతి ఇంటికీ లబ్ధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి కుటుంబమూ లబ్ధి పొందినట్లు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో 10 వేల ఇళ్ల పట్టాలిచ్చినట్లు పేర్కొన్నారు. 20 వేల ఇళ్లు మంజూరు చేయించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3 లక్షల కోట్లను పథకాల రూపంలో లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు.

గోరుముద్దలాంటి భోజనం

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు గోరుముద్దలాంటి భోజనం అందుతోందని ఎమ్మెల్యే అన్నారు. పాపంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్వయంగా ప్లేటులో పెట్టించుకుని రుచి చూశారు. 'జగనన్న గోరుముద్ద' ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌డ్డి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథరెడ్డి, మండల ఇన్‌చార్జ్ మఠం శ్యాంసుందర్, నాయకులు మాదన్న, ఆకుల మునిశంకరయ్య, స్టోర్ డీలర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం



ఎస్‌ఐ ఆంజనేయులుకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ మహిళా కార్యకర్త రామాంజినమ్మ అలియాస్ స్వర్ణక్కపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి కోరారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్లతో కలసి బుధవారం ఎస్‌ఐ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. రాప్తాడు ఆటోనగర్‌లో అక్రమంగా నిర్మించిన టీడీపీ కార్యాలయం వద్ద 44వ జాతీయ రహదారిపై హోటల్ నిర్వహిస్తున్న రామాంజినమ్మ ఈనెల 12వ తేదీన సోషల్ మీడియాలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతిని అసభ్యకరమైన పదజాలంతో దూషించిందన్నారు. ఆ వీడియో వైరల్ కావడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రామాంజినమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈమె 44వ జాతీయ రహదారిపై హోటల్ నిర్వహిస్తూ ఆ సాంఘిక కార్యక్రమాలతో జీవనం సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు ఉషారాణి, భాగ్యలక్ష్మి, షాను, అంకాలమ్మ, ప్రభావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, నాయకులు రవి పాల్గొన్నారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడలు

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 15వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్లు పీడీ రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, యోగా, బ్యాడ్మింటన్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. 16వ తేదీన 100, 200, 400, 800, 1,500 మీటర్ల పరుగు పోటీలు ఉంటాయన్నారు.

రోడ్డు విస్తరణపై వినతి



జేసీ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్

అనంతపురం సిటీ: అనంతపురంలోని క్లాక్ టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణపై ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్ జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం జెడ్పీలోని సీఈఓ చాంబర్‌లో ఇన్‌చార్జ్ సీఈఓ, జేసీ కేతన్‌గార్గ్‌ను కలిశారు. రోడ్డు విస్తరణలో భాగంగా నమాజ్ కట్ట వరకూ సెంటర్‌లైన్ అనుసరించాలన్నారు. జామియా మసీద్‌తో అనుసంధానించిన నమాజ్ కట్ట మసీద్, దాని దుకాణాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు.

సాంకేతికత అందిపుచ్చుకోండి

అనంతపురం: మారుతున్న కాలానుగుణంగా నూతన సాంకేతికత అందిపుచ్చుకోవాలని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ ఎం.రమేష్ నాయుడు అన్నారు. బుధవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ప్రతి విద్యార్థి బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు దక్కేలా మొదటి సంవత్సరం నుంచే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలన్నారు. బ్యాక్‌లాగ్స్ లేకుండా ఎప్పటికప్పుడు సబ్జెక్టులు పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అనంత రాముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి రావు, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం హజరత్‌సయ్యద్ మూరాద్‌షావలి 386వ ఉరుసు వేడుకలు ప్రారంభమయ్యాయి. స్థానిక చిన్న ఆసారు మందిరం నుంచి స్వామి దర్గా వరకూ గంధాన్ని ఊరేగించారు. భక్తులు స్వామికి చక్కెర సమర్పించారు. గురువారం ఉరుసు జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న త్రీటౌన్ సీఐ ధరణి కిశోర్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని త్రీటౌన్ సీఐ ధరణి కిశోర్ అన్నారు. బుధవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విగ్రహ ప్రతిష్ట, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇసుక, నీళ్లను ఏర్పాటు చేసుకుని తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. చట్ట విరుద్ధమైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదన్నారు. అవాంఛనీయ సంఘటన జరిగే అవకాశం ఉంటే ముందుగానే సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

ఆత్మకూరు: గ్రామాల్లో వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయకుడి విగ్రహాలకు ఏర్పాటు చేసే టెంట్లు శాశ్వతంగా ఉండేలా చేయరాదన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా రహదారుల్లో మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. మండపాల దగ్గర ఇసుక తప్పనిసరిగా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ తీగలతో ఎలాంటి ప్రమాదం లేకుండా చూసుకోవాలన్నారు. రాత్రి 10 గంటలు దాటిన తరువాత ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించరాదని హెచ్చరించారు. ముఖ్యంగా రాజకీయ ప్రసంగాలు, నినాదాలు ఉండరాదన్నారు. చట్ట విరుద్ధమైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదన్నారు. పేలుడు వస్తువులు మండపాల దగ్గర ఉంచరాదన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా వెంటనే పోలీసులు, లేదా 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌తో ప్రయోజనాలు



తోపుదుర్తిలో పంటకోత ప్రయోగాలు చేస్తున్న అధికారులు

ఆత్మకూరు: తోపుదుర్తి వద్ద బుధవారం ఎన్ఎస్ఎస్ఓ (నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్) అధికారుల ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. వేరుశనగ పంటను నిర్దేశించిన కొలతల మేరకు తొలగించి తూకం వేశారు. నివేదికలను జిల్లా అధికారులకు పంపుతున్నట్లు ఏఈఓ సుజిత తెలిపారు. అదే విధంగా మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ఓ అధికారులు శివశంకర్,మధు, ప్రియేష్‌కుమార్, ఎంపీఈఓ దాదావలి తదితర రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బొలెరో



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాప్తాడుకు చెందిన సాకే రాము రామగిరి మండలంలోని కుంటిమద్ది సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా, అనంతపురానికి చెందిన సుధాకర్ రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు ఉద్యోగులు బుధవారం ఒకే ద్విచక్ర వాహనంలో డ్యూటీకి బయలుదేరారు. ద్విచక్ర వాహనం రాప్తాడు దాటి హంపాపురం సమీపంలో 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా వెనుక వైపు నుంచి గుర్తు తెలియని బొలెరో ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరు ఉద్యోగులను 108లో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. సాకే రాము పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీలకతీతంగా పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'గత ప్రభుత్వంలో పింఛన్ పొందాలంటే నగరపాలక సంస్థ ముందు ప్రదక్షిణలు చేయాలి. అప్పట్లో లబ్ధిదారుల్లో ఎవరో ఒకరు మరణిస్తే కొత్త పింఛన్ మంజూరయ్యే పరిస్థితి ఉండేది. అయితే జగనన్న నాయకత్వంలో పార్టీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా పింఛన్ అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రాణినగర్‌కు చెందిన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 5 గంటల నుంచే మీ ఇంటి వద్దకు పింఛన్ అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, ఎం.దేవి, వై.లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మాట్లాడుతున్న తహసీల్దార్ షర్మిల

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఈనెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షర్మిల, డాక్టర్ దయాకర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో వలంటీర్లతో సర్వే చేయిస్తామన్నారు. మండలంలో సచివాలయాల వారీగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక జబ్బులు ఉన్న వారిని జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబిహా సుల్తానా, ఎంఈఓ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు

అనంతపురం టవర్‌క్లాక్: ఓపెన్ ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ అనుమతులు లేని ఓరియంటల్ సర్టిఫికెట్ ఇచ్చి విద్యార్థులను మోసగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఓపెన్ ఇంటర్ విద్యార్థులతో డబ్బులు వసూలు చేసి, పరీక్షలు రాయించి చెల్లని సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. ఈ సర్టిఫికెట్లతో కళాశాలల్లో చేరడానికి వెళ్తే సర్టిఫికెట్లు చెల్లడం లేదు. చెల్లని సర్టిఫికెట్లు ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నా కష్టమంతా.. నీ కోసమే కన్నా..



తల్లిదండ్రులకు పిల్లల బాగోగుల కంటే ఏదీ ముఖ్యమైన అంశం కాదు. వారి కోసం ఎన్ని కష్టాలైనా సంతోషంగానే ఎదుర్కొంటారు. రెక్కలు ముక్కలు చేసుకునైనా సరే పిల్లలకు ఉత్తమ భవిష్యత్తు ఇవ్వాలని తపన పడుతుంటారు. అందుకీ చిత్రం చక్కటి నిదర్శనం. అనంతపురం రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న సైఫుల్లా బ్రిడ్జి వద్ద ఓ తల్లి తోపుడుబండిపై బిడ్డను నిద్రపుచ్చుతూ ఎండలోనే పూలు అమ్ముతున్న దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం